# విశ్వవిద్యాలయాల్లో కులసంస్కృతి పోవాలి

తేది: 03.03.2017

విశ్వవిద్యాలయాల్లో కులసంస్కృతి పోవాలని, అప్పుడే వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని సరస్వతీపుత్ర డా॥ మేడసాని మోహన్ పేర్కొన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో తాళ్ళపాక కవుల సాహితీ వైభవం అనే అంశంపై రెండు రోజుల యుజిసి జాతీయ సదస్సును ఎమెనో భవనంలోని సెమినార్ హాలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.మేడసాని మోహన్ కీలకోపన్యాసం చేస్తూ.. కుల అంతరాలు మాసిపోవాలని అన్నమయ్య ఆనాడే కోరుకున్నాడని తెలిపారు. పదకవితకు అన్నమయ్య ఆద్యుడని, భారత భాగవత పురాణాల, ఇతిహాసాల సారాంశంగా సంకీర్తనలు ఉంటాయని వివరించారు. మంచి పనులు చేయడమే భక్తికి పరాకాష్ట అని, కర్తవ్య నిష్ఠతో పనిచేస్తే సమాజం ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ మాట్లాడుతూ... వ్యక్తిత్వ వికాసానికి అన్నమయ్య సాహిత్యం ఉపయోగపడుతుందని, సంకీర్తనా సాహిత్యాన్ని అందించడానికి పండితులే ఇక్కడికి తరలిరావడం గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. గురువులపట్ల, విద్యపట్ల విశ్వాసం ఉంచితే ఉన్నత లక్ష్యాలను సాధించగలరని విశిష్ట అతిథిగా పాల్గొన్న సముద్రాల లక్ష్మణయ్య అన్నారు. వేద తత్వాన్ని అన్నమయ్య జానపద బాణీల్లో అందించారని, మోక్షం భూమి, ఆకాశం, పాతాళాలలో లేవని మనసులోనే ఉందని అన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఆచార్య జి.దామోదరనాయుడు మాట్లాడుతూ... సమసమాజాన్ని దర్శించి, ఆ భావాన్ని పంచిన వారిలో అన్నమయ్య ఒకరని తెలిపారు. శ్రీశ్రీ అన్నమయ్య సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఉంటే తనకు వచ్చిన కవుల జాబితాలో అన్నమయ్యను చేర్చి ఉంటాడని విశ్లేషించారు. సభాధ్యక్షులు డా.చిన్నరెడ్డయ్య మాట్లాడుతూ.. అన్నమయ్య పదాలు రాశిలోనూ, వాసిలోనూ హిమాలయాల వంటివన్నారు. సదస్సు సంచాలకులు డా.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ... అన్నమయ్య సంకీర్తనలు తెలుగు భాషకే గాక, భారతీయ సాహిత్యానికే వన్నె తెచ్చాయని కొనియాడారు. ఈ సదస్సులో కుప్పం కడా ప్రత్యేక అధికారి ఎ.శ్యామ్ ప్రసాద్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో డా.భూక్య తిరుపతి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



